# జోక్ సరదా కథలు

## సీసా పాతదే సారా పాతదే లేబుల్ మారింది.

మహేష్‌కి గుండెల్లో బెరుగ్గా, బితుకు బితుకుగా ఉంది. నిజానికి గుండెల్లో రైళ్ళు పరిగెడుతున్నాయి అనాలి కానీ ఈ మధ్య అవి యమా ఖచ్చితంగా — పవర్ కట్ అమలు జరుపుతున్నంత పెర్‌ఫెక్ట్‌గా పట్టాలు తప్పేస్తున్నందున బెరుగ్గా, బితుకు బితుకుగా అని వర్ణించటమే బెటరు.

కారణం ఆరోజు అతడికి శోభనం రాత్రి. హుషారుగా ఉండాల్సిన అతడు అలా ఉండడానికి అతనిలో ఏ లోపమూ లేదు. కాకపోతే కాలేజీ చదివేరోజుల్లో అతనికి ఎవరో చెప్పిన జోకే మాటి మాటికి గుర్తుకొస్తోంది.

ఆజోక్ ఏమిటంటే—

ఓ సుఖ పురుషుడికి పెళ్ళయిందట. శోభనం నాటి రాత్రి అలవాటు తన భార్యకి వందరూపాయల నోటు ఇచ్చాడట. వెంటనే ఆమె కూడా దిండు కింద నుంచి యాభై రూపాయల చిల్లర తీసి ఇచ్చేసిందట— తన అలవాటు కొద్దీ!

ఇపుడు మహేష్‌కి తన శోభనం రోజున ఆజోక్ మాటి మాటికీ గుర్తుకు రావటానికి కారణం — ఒకప్పుడు లైఫ్‌ని తెగించేసి తెగ ఎన్‌జాయ్ చేసేసిన గిల్టీ కాన్షస్!

"చేసుకున్న వాళ్ళకి చేసుకున్నంత మహదేవ అన్నారు పెద్దలు... ఏమో.. ఆ జోక్‌తో అయినట్టు తనకు కూడ సెకెండ్ హేండ్ భార్య దొరుకుతుందేమో... తన బ్రతుకు మరో పెద్దజోక్ అయిపోతుందేమో?" అని కలవరపడిపోతున్నాడు.

అంతలో... చప్పుడైంది తలుపు... లోపలకి అడుగు పెట్టింది మాధవి.

"రా..." అన్నాడు గుండె నిబ్బరించుకుని. తనని తాను నిగ్రహించుకుంటూ.

ఆ క్షణంలోనే అతనికి వెలిగిందో ఫ్లాష్!

ఆ జోక్ లో చెప్పినట్టు — తను పొరపాటున వంద రూపాయలు ఇచ్చేసి, దానికి ఆ అమ్మాయి తన అలవాటు కొద్దీ యాభై రూపాయిల చిల్లరిచ్చేసి తతంగం— శోభనం తర్వాత ఎందుకూ!?

అదేదో ముందే ఇచ్చేస్తే పోలా!? ఒకవేళ అమాయకురాలే అయితే బిత్తరపోతుంది. అప్పుడు తను ఘొల్లుమని నవ్వేసి ఈజోక్ చెప్పేసి ఆమెను కూడా మూడ్ లోకి తీసుకు వచ్చేయ్యొచ్చు.

ఒకవేళ అమ్మాయే కనుక జంబలకిడి పంబలో తూటాలరాణిలా పెద్ద కరోడాయే అయితే ఏ సంగతీ ఇప్పుడే తేలిపోతుంది అంచేత ఆ ఇచ్చేదేదో ముందే ఇచ్చెయ్యటం అన్నివిధాలా శ్రేయస్కరం.




ఇంత మంచి ఫ్లాష్ సరిగ్గా సమయానికి వెలిగినందుకు తనని తాను అభినందించుకుంటూ జేబులోంచి ఓ వంద రూపాయల నోటు తీసి ఇచ్చాడు మహేష్.

"ఇదేంటండీ?" అంటూ అడిగింది మాధవి.

ఆమె స్వరంలో ఓ సన్నని ఒణుకు

ఆనందంతో గుండె ఉప్పొంగి పోయిందతనికి, 'హుర్రే' అంటూ గట్టిగా అరుద్దామనుకున్నాడు. గది అవతల ఉన్నవాళ్ళు మోలా అపార్థం చేసేసుకొని తెగ రెచ్చిపోయే ప్రమాదం ఉందని ఊహించి ఆనందాన్ని అణచేసుకున్నాడు. 'అయినా చూద్దాం' అనుకొని

"ఫరవాలేదు తీసుకో" అన్నాడు మరికాస్త కవ్వింపుగా చూస్తూ.

ఆమె శరీరం గజగజా వణకటం అతనికి స్పష్టంగా కనిపిస్తోంది. "కరెక్ట్... లోకంలో తనంత అదృష్టవంతుడు ఇంకోడు లేడు. తన భార్య పవిత్రత ఉన్న పతివ్రత. తనుభయపడ్డట్టుగా సెకెండు హేండ్ కాదు. లోకానికి ఎలుగెత్తి చెప్పాలి — చేసుకొన్న వాళ్ళకి చేసుకున్నంతకాదు అని" ఇలా పరిపరివిధాలా ఆలోచిస్తూ ఫుల్ మూడ్స్‌లోకి వచ్చేస్తున్నాడు మహేష్.

అసలు తనలోని ఈ ఆనందానికి కారణం తన స్నేహితుడు ముకుందం. ఇప్పుడు తన జీవితంలోకి అడుగు పెట్టిన అతిపవిత్రమైన మాధవి — ముకుందం భార్యకి పిన్ని కూతురు వరస. వాళ్ళమ్మా నాన్న చనిపోవటంతో దిక్కులేక వీరిపంచన తలదాచుకుంటోందట.

"మా మరదలు నాకోసమస్య అయిపోయింది బ్రదరూ! ఎలాగైనా ఆపుణ్యం నువ్వే కట్టుకోవాలి" అన్నాడు ముకుందం తనతో. అప్పటికది పదోసారో పదిహేనోసారో తనని అతడు బ్రతిమాలడం.

"నా సంగతి నీకు తెలీదా బ్రదరూ... మనం కాస్త విలిపి కదా" అని నిజం చెప్పేశాడు మహేష్ కొన్నాళ్ళ తర్వాత తెగించేసి.

"జోక్ అదా... మరేం ఫర్వాలేదులే బ్రదరూ... నువ్వు మంచివాడివి కనుక ముందే చెప్పేశావు. అయినా ఆమాత్రం ఎక్స్‌పీరియన్సు లేనివాళ్ళు ఈ రోజుల్లో ఎంతమంది ఉన్నార్లే!? మనకలాంటి వేం లేవు. నువ్వు కూడా మనసులో పెట్టుకోకు" అన్నాడు ముకుందం.

అంతే... పెళ్ళయిపోయింది.

'ముకుందానికి ఖచ్చితంగా థాంక్స్ చెప్పాలి. చెప్పి తీరాలి. స్నేహానికి నిజమైన నిర్వచనం ముకుందమే...'

ఇలా పరిపరివిధాల ఆలోచిస్తూ మాధవి వంక చూశాడు మహేష్. ఆమె చూపుల్లో భయం, శరీరంలోని గజగజ ఇంకా తగ్గలేదు. పులిని చూసిన లేడిపిల్లలా ఒణికి పోతందామె.

"ఏంటి ఆలోచిస్తున్నావ్..." ఫర్వాలేదు తీసుకో" అన్నాడు మహేష్—

ఇదే లాస్ట్. ఇంక ఆమెను ఏడిపించకూడదనుకుంటూ.

"ఒద్దండీ... ఇలా ఇవ్వకండీ... ఇలా తీసుకుంటే మా ముకుందం బావ హంటర్ తీసుకుని చితక్కొట్టాడండీ. ఇచ్చేదేమైనా ఉంటే అతనికి ఇవ్వండి. తనకెంత ఇష్టమైతే అంత నాకిస్తాడు" అంది మాధవి.